ప్రజాశక్తి
శుక్రవారం 25 జులై 2025 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

# మెట్రోకు మంత్రివర్గం ఆమోదం

- నేడు గ్లోబల్ టెండర్లు ఆహ్వానం
- రెండు కారిడార్లకు రూ.10,118 కోట్లు
- తొలిదశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులు రూ.3,497 కోట్లు సిఆర్‌డిఏ నుంచి విడుదల

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

దశాబ్దకాలం తర్వాత విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయ్యింది. దీనిలో భాగంగా తొలిదశలో ప్రతిపాదిత రెండు కారిడార్‌లకు ఆంధ్రప్రదేశ్ మెట్రో రైలు కార్పొరేషన్ (ఎపిఎంఆర్‌సి) గ్లోబల్ టెండర్లు ఆహ్వానిస్తోంది. శుక్రవారం ఈ ప్రాజెక్టు టెండర్ వివరాలను ఎపిఎంఆర్‌సి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. గన్నవరం నుంచి ఎన్‌హెచ్ 16, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, రైల్వే స్టేషన్ నుంచి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పిఎన్‌బిఎస్) వరకు 25.926 కిలోమీటర్లు, పిఎన్‌బిఎస్ నుంచి బందరు రోడ్డులో పెనమలూరు వరకు 12.020 కిలోమీటర్లు మొత్తం 37.946 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టులో రెండు కారిడార్‌లను తొలిదశలో నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రం వాటా 50 శాతం, రాష్ట్రం వాటా 50 శాతం కేటాయించాల్సి ఉంది. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.10,118 కోట్లు కాగా, దీనికి చైనాకు చెందిన ఎఐఐబి రుణం ఇవ్వడానికి ముందుకు వచ్చింది. కేంద్రం 20 శాతం, రాష్ట్రం 20 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. ఇప్పటి వరకు కేంద్రం నుంచి మౌఖిక ఆమోదం మాత్రమే రావడంతో కేంద్రం వాటా, చైనా సంస్థ నుంచి రుణం వెంటనే అందే అవకాశం లేదు. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎపిసిఆర్‌డిఎ) నుంచి ప్రభుత్వం రూ.3,492 కోట్లు కేటాయించింది. దీంతో టెండర్ల ఆహ్వానానికి మార్గం సుగమమైంది. ఈటెండర్లు రెండు నెలల్లో ఖరారు చేసి పనులు ప్రారంభించనున్నట్లు ఎపిఎంఆర్‌సి చెబుతోంది. ఈక్రమంలోనే ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల్లో మరికొన్ని సర్వేలు నిర్వహించనున్నారు.

### రాష్ట్రంపై భారం

విభజన హామీల్లో భాగంగా ఈ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో కేంద్రం నిధులు ఇవ్వాల్సి ఉంది. అయితే 50 శాతం మాత్రమే ఇవ్వడానికి అంగీకరించింది. దీంతో మిగిలిన 50 శాతం భారం రాష్ట్రంపై పడనుంది.

### సంక్లిష్టంగా భూ సేకరణ

రెండు కారిడార్ల నిర్మాణానికి 82.66 ఎకరాల భూములు సేకరించాల్సి ఉంది. ఈ క్రమంలోనే కారిడార్లను మార్చాలని పలువురు వినతులు అందించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు భూ సేకరణ ముందుకు తీసుకెళ్లడం సంక్లిష్టమవుతుందనే చర్చ జరుగుతోంది.

# సమీకరణ...లేకుంటే సేకరణ!

- 24 గ్రామాల్లో త్వరలో నోటిఫికేషన్లు
- సిఆర్‌డిఏ పరిధిలో అధికారుల కసరత్తు

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి**

రాజధాని అమరావతి విస్తరణలో భాగంగా సిఆర్‌డిఎ పరిధిలోని 24 గ్రామాల్లో మలి విడత భూ సమీకరణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రైతులు వ్యతిరేకిస్తున్నా కొత్త ప్రాజెక్టులకు భూమి అవసరమని, మలి విడత సమీకరణ అనివార్యమని సిఆర్‌డిఏ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా అమరావతి రైల్వే లైను, స్పోర్ట్సు సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఇతర ప్రాజెక్టుల కోసం ఇప్పటికే ఎంపిక చేసిన 24 గ్రామాల్లో గుర్తించిన భూములను సమీకరణలో తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తుళ్లూరు, అమరావతి, పెదకూరపాడు తదితర మండలాల్లోని 24 గ్రామాల్లో కొంత మంది రైతులు వ్యతిరేకిస్తున్నందున ప్రభుత్వం ఈ అంశంపై తర్జనభర్జనలు పడుతోంది. భూములు తీసుకోవడం అవసరం కనుక సమీకరణకు ముందుకు రాకపోతే సేకరణ ద్వారా భూములు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు చర్చించినట్లు తెలిసింది. రాజధాని గ్రామాల్లో 2015లో భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చిన ప్యాకేజిని ఇప్పుడు కూడా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రైతులు అందుకు సుముఖత చూపడం లేదు. 2015లో రాజధాని గ్రామాలుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో భూముల ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు రాజధాని సమీపంలోని మండలాల్లో భూములు ధరలు బాగా పెరిగాయని, అందువల్ల అప్పుడు ఇచ్చిన ప్యాకేజి ఇప్పుడు ఇస్తే తమకు నష్టం వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక ప్రభుత్వం ఇచ్చే 1200 గజాల స్థలం తీసుకుని అమ్ముకోవడం కన్నా తామే ఎకరం భూమిని ప్లాట్లు వేసుకుని అమ్ముకుంటే ఎక్కువ మొత్తం వస్తుందని కొంతమంది రైతులు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. దీంతో రైతుల్లో పునరాలోచన మొదలైంది. వాస్తవంగా మలి విడతలో 44 వేల ఎకరాలను తీసుకునేందుకు ప్రభుత్వం తొలుత ప్రణాళిక రూపొందించింది. కానీ కొన్ని గ్రామాల రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం మలి విడత సమీకరణను 24 వేల ఎకరాలకు కుదిరించింది. మలి విడతలో ముందుగా ఆసక్తి ఉన్న రైతుల నుంచి భూములు తీసుకుని, సుముఖత చూపని వారి నుంచి భూ సేకరణ ద్వారా తీసుకుంటామని ప్రభుత్వం చెప్పకనే చెబుతోంది. కొంతమంది రైతులు కూడా తమకు 2013 భూ సమీకరణ చట్టం ద్వారా తీసుకుంటే కొంత మేలు కలుగుతుందనే భావనలో ఉన్నారు. అంతేగాకుండా భూమిని అప్పగించిన వెంటనే సొమ్ములు తమ ఖాతాలో పడతాయని, సమీకరణలో ప్లాట్లు ఇచ్చి వాటిని అమ్ముకునేందుకు చాలా కాలం పడుతుందనే భావన రైతుల్లో ఏర్పడింది. 2015లో రాజధాని గ్రామాల్లో 29 గ్రామాల్లో భూములు ఇచ్చిన 30 వేలమంది

(మిగతా 2లో)

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

### విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా

# దశలవారీగా ఉద్యమం ఉధృతం

- ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ తీర్మానం
- 29 వరకు విస్తృత ప్రచారం
- 30 నుండి పాదయాత్రలు, ప్రభాత భేరీలు
- 5న సబ్‌స్టేషన్ల వద్ద నిరసనలు

**ప్రజాశక్తి - విజయవాడ :** విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 29వ తేదీ వరకు అన్ని మండలాలు, పట్టణాల్లో కరపత్రాలు పంపిణీ, సంతకాల సేకరణ, ఇంటింటి ప్రచారం తదితర రూపాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. జులై 30 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు సమావేశాలు, పాయాత్రలు, ప్రభాత భేరీలు, ఆగస్టు 5న విద్యుత్ సబ్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు నిర్వహించాలని తీర్మానించింది. 'స్మార్ట్‌మీటర్లు పెట్టొద్దని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని' డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన గురువారం స్థానిక బాలోత్సవ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వినియోగదారుల (మిగతా 2లో)

# జోరు వానలు

**ప్రజాశక్తి - విజయవాడ :** ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల వ్యాప్తంగా గురువారం కూడా భారీ వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు పొంగుతున్నాయి. పాలేరు, మునేరు, బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విజయవాడలో డ్రైన్లు పొంగుతూ రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీటిని బయటకు పంపడం నగర పాలక సంస్థ అధికారులకు తలకుమించిన భారంగా తయారైంది. గురువారం ఉదయం 8.30 నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఎన్‌టిఆర్ జిల్లాలో 74.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 3.72 మిల్లీమీటర్లుగా ఉంది. 20 మండలాల పరిధిలో నమోదైన వర్షపాతం వివరాలు మిలీమీటర్లలో... వత్సవాయి మండలంలో 6.6, విజయవాడ రూరల్ 6.4, విజయవాడ నార్త్ 5.8, విజయవాడ సెంట్రల్ 5.4, విజయవాడ వెస్ట్ 5.4, పెనుగంచిప్రోలు 5.2, విజయవాడ ఈస్ట్ 5.2, మైలవరం 4.8, విస్సన్నపేట 4.6, చందర్లపాడు 4.2, తిరువూరు 4.0, ఇబ్రహీంపట్నం 2.8, ఎ.కొండూరు 2.6, వీరులపాడు 2.2, గంపలగూడెం 2.2, జగ్గయ్యపేట 1.8, రెడ్డిగూడెం 1.6, నందిగామ 1.2, జి.కొండూరు 1.2, కంచికచర్ల మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు

ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు

## బ్యారేజీకి వరద తాకిడి

**ప్రజాశక్తి - విజయవాడ, సిటీ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో 25,200 క్యూసెక్‌లు, అవుట్ ఫ్లో 29,521 క్యూసెక్‌లుగా ఉంది. ఈ క్రమంలో గురువారం బ్యారేజీ 35 గేట్లను ఒక అడుగు మేరఎత్తి 29,521 క్యూసెక్కుల నీటిని దిగువకు (సముద్రంలోకి) విడుదల చేశారు. కృష్ణా తూర్పు, పశ్చిమ కాల్వలతోపాటు మెయిన్ కాల్వకు 4,321 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీనిలో కెఇ మెయిన్ కెనాల్‌కు 3,305 క్యూసెక్కులుకాగా, కెడబ్ల్యు మెయిన్ కెనాల్‌కు 1016 క్యూసెక్కులు ఉన్నాయి. బ్యారేజ్ వద్ద నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కాగా.. ప్రస్తుతం 11.8 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో బ్యారేజీ దిగువున నివసించే కృష్ణా నది కరకట్టతోపాటు లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బ్యారేజికి వరద నీటి ప్రవాహం పెరగడంతో పట్టిసీమ, పులిచింతల ప్రాజెక్టుల నుండి వచ్చే నీటిని నిలుపుదల చేశారు.

## ఘనంగా ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం

వార్త 2లో

## లక్ష్యాల సాధనకు బంగారు బాటలు : కలెక్టర్

**ప్రజాశక్తి - విజయవాడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టితో పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పరంగా మెరుగైన మార్పులు చేయడంతో ప్రవేశాలు పెరిగాయని, వీటిని సద్వినియోగం చేసుకొని కెరీర్ పరంగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు బంగారు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. విజయవాడ కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నతపాఠశాలను కలెక్టర్ లక్ష్మీశ గురువారం మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం.నరసింహాచార్యులు పాల్గొన్నారు.

## మోహినీ విజయం నాటకం ప్రదర్శన

**ప్రజాశక్తి, విజయవాడ :** శ్రీసాయి హదయ కళా నాట్యమండలి 33వ వార్షికోత్సవం సందర్భంగా "మోహినీ విజయం" పౌరాణిక నాటకాన్ని గురువారం రాత్రి స్థానిక వి.హెచ్ గ్రంథాలయంలో విజయవంతంగా ప్రదర్శించారు. నాగేశ్వరశర్మ దర్శకత్వంలో అగురు త్రినాథ్ నాయుడు (సంస్థ అధ్యక్షులు) ప్రధాన పాత్రలో నాటకాన్ని ఆద్యంతం రక్తిగట్టించారు. ఈసందర్భంగా సంగీత విద్వాంసులు పైడేశ్వరరావు, బొత్స సూర్యనారాయణలను ఘనంగా సన్మానించారు. పౌరాణిక రంగస్థల కళాకారుల సంఘ విజయవాడ అధ్యక్షుడు గుమ్మడి జీవన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కార్యదర్శి మోత్రు అంటోని, మంగమ్మతల్లి కళానాట్యమండలి అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, ప్రముఖ వ్యాఖ్యాత హరిగోపాల్ పాల్గొన్నారు.

## విఎంసి కమిషనర్ పర్యటన

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం గురువారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, వాటర్ ట్యాంక్ రోడ్, సాంబమూర్తి రోడ్, గవర్నర్‌పేట సి కె రెడ్డి రోడ్, అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# ఘనంగా ఎన్‌జి రంగా వర్సిటీ స్నాతకోత్సవం

## విద్యార్థులకు డిగ్రీలు, అవార్డులు ప్రదానం

స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

**ప్రజాశక్తి - ఉంగుటూరు :** కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్టు ప్రజా మందిరంలో గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి డిగ్రీలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని రైతాంగానికి 60 ఏళ్లుగా నిబద్ధతతో కూడిన సేవలను అందిస్తోందని కొనియాడారు. అసాధారణ వ్యవసాయ ప్రతిభను పెంపొందించడంలో సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్రను కలిగి ఉందన్నారు. విశ్వవిద్యాలయ నిరంతర కషి ఫలితంగానే 2023-24లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో 25 మెరుగైన పంట రకాలను విడుదల చేశారని, దీని ద్వారా విశ్వవిద్యాలయం రైతులకు ఆదాయం పెంపొందించే దిశలో ముఖ్యంగా వరిలో నాణ్యమైన దిగుబడుల సాధనకు దోహదపడిందన్నారు. వివిధ పంటల్లో 10,215 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాలు, 17,240 క్వింటాళ్ల ఫౌండేషన్ ధృవీకరణ విత్తనాలను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని బహుళ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, రైతులకు పంపిణీ చేసేందుకు ఎంతో కృషి చేసిందన్నారు. అలాగే విశ్వవిద్యాలయ కషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, క్షేత్ర పరిశీలనలు, రోగనిర్ధారణ సర్వేల ద్వారా అధిక ఉత్పాదకతను, ఆహార భద్రతను సాధించడానికి దోహదపడుతోందన్నారు. వ్యవసాయంలో సాంకేతిక సాధికారత అత్యంత ప్రాముఖ్యతను విస్తరణ కార్యకలాపాల ద్వారా చాటిచెబుతోందన్నారు. వ్యవసాయ రంగంలోకి కొత్త ప్రవేశించిన విద్యార్థులు సవాళ్లను స్వీకరించడం, సరిహద్దులను దాటడం, నేర్చుకోవడం ఎప్పుడూ ఆపొద్దని సూచించారు. పంజాబ్ రాష్ట్ర ఎన్ఆర్ఐ కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఏ వేణు ప్రసాద్ ముఖ్య అతిథి మాట్లాడుతూ దేశ వ్యవసాయంలో ఉత్పత్తి స్తబ్దత, పెరుగుతున్న సాగు ఖర్చులు, తగ్గుతున్న నికర ఆదాయం, మారుతున్న వాతావరణ పరిస్థితులు, నిస్సారమైన భూములు వంటి అనేక సమస్యలు గమనిస్తున్నామన్నారు. వీటిని అధిగమించి సుస్థిరత సాధించడానికి సాగులో వైవిధ్యం సాధించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం, సేంద్రీయ వ్యవసాయ వనరులను సంరక్షించే సాంకేతికతను ఆచరించడం, బలోపేతం చేయడం వంటి అంశాలపై దష్టి సారించాలన్నారు. ముందుగా ఆచార్య రంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీ దేవి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్నాతకోత్సవంలో 46 మందికి డాక్టరేట్లు, 196 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 1,420 మంది గ్రాడ్యుయేట్లకు వివిధ పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. వ్యవసాయ శాస్త్రంలో అత్యుత్తమ పరిశోధనలకుగాను డాక్టర్ ఎం.వి.రెడ్డి జాతీయ అవార్డు-2024ను డాక్టర్ ప్రశాంత కె.దాష్ (ఎడిజి-కమర్షియల్ క్రాప్స్, ఐసిఎఆర్, న్యూఢిల్లీ)కు, వి.రామచంద్రరావు జాతీయ పురస్కారం 2024ను డాక్టర్ పి.వి.సత్యనారాయణ (పరిశోధన సంచాలకులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం)కు ప్రదానం చేశారు. పలువురు ప్రొఫెసర్లు, సైంటిస్టులకు మెరిటోరియస్ టీచర్ అవార్డులు, మెరిటోరియస్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డులు, మెరిటోరియస్ ఎక్స్టెన్షన్ సైంటిస్ట్ అవార్డులు, యంగ్ సైంటిస్ట్ అవార్డులు అందించారు. తొలుత వ్యవసాయ శాఖ కమిషనరు ఎస్.ఢిల్లీరావు, కృష్ణాజిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్‌పి ఆర్.గంగాధరరావు, విసి డాక్టర్ శారద జయలక్ష్మి దేవి, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు తదితరులు గవర్నరుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వర్ణ భారత్ ట్రస్టు ప్రజా మందిరం వెలుపల గవర్నర్ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ప్రజా మందిరంలో బోర్డు సభ్యులు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులతో గ్రూప్ ఫొటో దిగారు. స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నరు కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్ లాల్, గవర్నర్ ఎడిసి మేజర్ అమన్ దీప్ సింగ్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, గుడివాడ ఆర్‌డిఒ జి.బాలసుబ్రమణ్యం, కార్యక్రమ నోడల్ అధికారి షేక్ షాహిద్ బాబు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE IIIrd Addl. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA**
**I.A .No. 71/2023**
**In O.S.No. 60/2021**
**Between :-**
**Gogineni Mani .**
..........**Petitioner / Plaintiff**
**AND**
**Panchakarla Trinadh Venkta Satyanarayana**
......**Respondent / Defendant**
**To,**
**Panchakarla Trinadh Venkata Satyanarayana, S/o Athaiah, R/o D.No.1-168, Ramalayam Street, Ramavrapadu Village, Vijayawada Rural mandal, Krishna dt.**
పై నెంబరు పిటీషనర్ పై కోర్టులో పిటిషన్ ఫైల్ చేయగా దానిలో రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా తిప్పిపంపిన కారణంగా మీ హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు ఈ స్యూన్ పేపరు ద్వారా తెలియజేయ వలసినదిగా ది.04.08.2025న కు వాయిదా వేసినారు. . సదరు వాయిదా రోజున ఉదయం 10.30లకు మీరు స్వయంగాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు లో హాజరై తమకు గల అభ్యంతరాలు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షముగా తీర్మానం చేయుదురని ఇందు మూలంగా తెలియజేయడ మైనది. శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా తేది : 04-08-2025
ఇట్లు : నర్రా నాగేశ్వరరావు, న్యాయవాది.
**Vijayawada,** పటమట, విజయవాడ-10.
**Dt:24-07-2024.** సెల్ ఫోన్: 9848523050.

**డాక్యుమెంట్స్ పోయినవి**
కృష్ణాజిల్లా, మచిలీపట్నం మండలం, ఎన్ గొల్లపాలెం పంచాయతీ పరిధిలోని తుమ్మలపాలెం గ్రామం,డోర్ నెంబర్ 3-11, నివాసితులైన బండారులంక నాంచార రావు S/o వెంకటేశ్వరరావు కు సంబంధించిన తుమ్మల పాలెం గ్రామంలోని సర్వేనంబర్ 254 -2బి వ్యవసాయ భూమికి సంబంధించిన 25 సెంట్ల ఒరిజినల్ డాక్యుమెంట్, చిన్నాపురం బ్రాంచ్ ఆంధ్రాబ్యాంకు చెక్‌బుక్, పాన్‌కార్డు, ఆధార్ కార్డ్ మరియు 100 రూపాయల స్టాంప్ పేపర్లు మే 25,2025 తేదీన బైక్‌పై తుమ్మలపాలెం నుండి మచిలీపట్నం వెళ్తుండగా మార్గ మద్యం లోని చిన్నాపురం పరిసరాలలో పోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.
**బండారులంక. నాంచారరావు**
**డోర్ నెంబర్ 3-11,తుమ్మలపాలెం**
**మచిలీపట్నం, కృష్ణాజిల్లా.**
**ఫోన్ నెంబర్ 9398873171**

**మహారాజశ్రీ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్)**
**అవనిగడ్డ కోర్టులో**
**ఐ.పి. నెం. 1/2025**
బిట్వీన్ :
మోర్ల శ్రీలక్ష్మీ మరియు ఇద్దరు .... పిటీషనర్లు
మరియు
యార్లగడ్డ నాగ శ్రీనివాసరావు మరియు ఇద్దరు .... రెస్పాండెంట్లు
**టు :**
**మూడవ రెస్పాండెంట్ :**
తుమ్మల వరలక్ష్మి, భర్త: సురేష్‌కుమార్, హిందువు, వయస్సు 41 సం॥లు, నివాసం : కొడాలి గ్రామం, ఘంటసాల మండలం, కృష్ణాజిల్లా
పై నెంబరు పిటీషనులో మీకు నోటీసులు అమలు నిమిత్తం శ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీ చేసివుఅన్నరు. సదరు ఉత్తర్వుల ప్రకారం పై నెంబరు పిటీషను ది. 30-7-2025వ తేదీకి వాయిదా అయివున్నది. ది. 30-7-2025వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకో గలరు. లేనియెడల పిటీషనులో మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 30-7-2025
**ఇట్లు**
**ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ,**
**న్యాయవాది, అవనిగడ్డ.**
**సెల్ : 9908160589**

## మొదటిపేజీ తరువాయి

## దశలవారీగా ఉద్యమం ఉధృతం

పాలిట స్మార్ట్ బాంబులుగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలకు వ్యతిరేకంగా దశలవారీ పోరాటానికి సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా స్మార్ట్‌మీటర్లను గృహాలకు సైతం బిగిస్తోందని విమర్శించారు. వాస్తవంగా విద్యుత్ వాడుకున్నదెంత, సర్‌ఛార్జి, ట్రూ అప్ చార్జీ, తదితర రూపాల్లో విద్యుత్ భారాలు ఎంత విధించారని ప్రతి వినియోగదారుడినీ వేధిస్తున్న సమస్య అన్నారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ ఛార్జీలు మరింత భారం కానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన విద్యుత్ సంస్కరణల కారణంగానే అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురై ఇంటి దారి పట్టిన విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఇప్పుడు తీసుకువస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లతో మరోసారి టిడిపి కూటమి ప్రభుత్వం పతనం కాక తప్పదని హెచ్చరించారు. బిజెపి పాలిత రాష్ట్రం రాజస్థాన్‌లో అక్కడి ప్రజలు స్మార్ట్ మీటర్లను తిరస్కరించారని, బెంగాల్లో కూడా అక్కడ వామపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రజలు చేసిన ఆందోళనలతో స్మార్ట్‌మీటర్లను అక్కడి ప్రభుత్వం రద్దు చేసుకోక తప్పలేదని అన్నారు. మన రాష్ట్రంలో అనంతపురం, గుడివాడ, విజయవాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లను వినియోగదారులు ధ్వంసం చేశారని తెలిపారు. ప్రజలకు ఉరితాళ్లుగా తయారైన స్మార్ట్‌మీటర్ల పట్ల ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. అయినా మాయోపాయాలతో అదానీ కంపెనీ ఉద్యోగులతో స్వయంగా విద్యుత్ అధికారులు దగ్గరుండి దొంగచాటుగా వీటిని బిగిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు భారమైన స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక ఉద్యమాలకు ప్రజాసంఘాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వ హయాంలో స్మార్ట్‌మీటర్లను టిడిపి నేతలు పగలకొట్టాలని పిలుపునిచ్చారని, అప్పుడు బాధుడే బాదుడు అన్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడైన మంత్రి నారాలోకేష్ నేడు అవే స్మార్ట్‌మీటర్లను బిగించడం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానానికి విరుద్ధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి అంటకాగుతూ, అదానీ కార్పొరేట్ కంపెనీకి కాసులవర్షం కురిపించే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. సిపిఐ ఎంఎల్‌స న్యూడెమోక్రసీ నగర నాయకులు పద్మ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరూ కలిసి కట్టుగా పోరాడితేనే స్మార్ట్ మీటర్లను తిప్పికొట్టగలమన్నారు. రెడ్ ఫ్లాగ్ నాయకులు మరీదు ప్రసాద్ బాబు మాట్లాడుతూ మరో విద్యుత్ ఉద్యమం తప్పదని, ఇందుకు టిడిపి ప్రభుత్వమే కారణమవుతుందని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాసరావు స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. సమవేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎం శ్రీనివాస్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ, నాయకులు ఎన్.నాగేశ్వరరావు, వై.సుబ్బారావు, ఎఐటియుసి నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేఆర్ ఆంజనేయులు, ఎం.సాంబశివరావు, ఐఎఫ్‌టియు నాయకులు కె.వి.రమణ, ఎం.ముని శంకర్, ఎఐవైఎఫ్ నాయకులు గోవిందరాజులు, పిఓడబ్ల్యు నాయకులు దుర్గతోపాటు నాయకులు దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

## సమీకరణ...లేకుంటే సేకరణ!

రైతులకు ఇంత వరకు రిటర్నబుల్ ప్లాట్లు అప్పగించలేదు. 10 ఏళ్లుగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో రైతులు సమీకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఆందోళనలో ఉన్నారు. అందువల్ల సమీకరణకు ముందుకు రాకపోతే సేకరణ ద్వారా భూములు తీసుకుని అందుకు అనుగుణంగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇంత కంటే మార్గం లేదని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. ఈమేరకు ప్రభుత్వం మలి విడత భూ సమీకరణకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిసింది.

**బహిరంగ ప్రకటన**
ఇందుమూలంగా యావన్మందికి తెలియేయునది ఏమనగా, మా క్లయింట్ తొర్లికొండ రామారావు తండ్రి వీరాస్వామి, నివాసం : నున్న, విజయవాడ వారి సూచనల మేరకు దిగువ పేర్కొన్న షెడ్యూలు ఆస్థిని, మా క్లయింట్, బైబిల్ స్కూల్ దగ్గర, గుణదల, విజయవాడ నందు నివాసం వుంటున్న ఊట్ల సుబ్బారావు గారి కుమారుడు పూర్ణచంద్రరావు గారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్నారు. సదరు ఊట్ల పూర్ణచంద్రరావు గారు ఆస్థిని, విక్రయ దస్తావేజు నెం, 7571/2011, తేది:14-9-2011 ద్వారా పొంది వున్నారు. కావున క్రింద పేర్కొన్న షెడ్యూలు ఆస్తిపై ఎటువంటి ఆక్షేపణలు, ఆరోపణలు ఎవరికైనా వున్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన తేదీ మొదలు ఏడు (7) దినముల లోపల క్రింద తెలిపిన అడ్రస్‌కు తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా తెలియజేయగలరు. లేని యెడల ఎవరికి ఏ విధమైనా అభ్యంతరాలు లేవని భావించి కొనుగోలు జరుగును. గడువు తర్వాత వచ్చు ఏ విధమైనా, క్లయిమ్‌లు, అభ్యంతరాలు మా క్లయింటు కు ఏ విధమైనా స్థిరపరచజాలవని యావన్మందికి తెలియజేయుచున్నాము.
**షెడ్యూలు ఆస్తి వివరాలు :**
కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలో చేరిన గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామపంచాయతీ ఏరియాలో చేరిన సూరంపల్లి గ్రామ సర్వే నెం. 243-4 రు య.0-55 3/4 సెంట్లు సబ్ డివిజన్ ప్రకారం రీ సర్వే నెం. 243-4-ఎ దాఖలా య. 0-55 సెంట్లు స్థిరాస్తి శేరీ పల్లం ఉప్పులపాటి కుంట చెరువు నీరు పారుబడి హక్కు గల వ్యవసాయ భూమికి హద్దులు :
తూర్పు : గానుగపంట నారాయణరెడ్డి గారి భూమి
దక్షిణం : పిట్టల బసవరాజు గారి భూమి
పడమర : పసుపులేటి రామారావు గారి భూమి
ఉత్తరం : కస్తాల సాంబశివరావు గారి భూమి
ఇట్లు
కె.సర్వేశ్వరరావు,
కె.అలేఖ్య,
న్యాయవాదులు,
**డోర్‌నెం. 14-482, భగత్‌సింగ్ నగర్,**
**యన్‌టిఆర్ బస్టాప్ ప్రక్కన, యనమలకుదురు.**
**విజయవాడ. ఫోన్ : 95818 73334.**

**NOTICE**
Under Instructions of my Client Smt. Deepthi Saggurthi @ Kancharla Deepthi W/o Kancherla Srikanth, aged about 39 years old, R/o H.No.59A-16-5/1, RTC Colony, Vijayawada-520008, I am authorised to publish the following notice:
That my Client named above hereby asserts that she is the absolute owner of the property admeasuring -
258 square yards together with their building thereon bearing H/No.64-1-18, Krishnaveni School Road, situated in R.S.No.68/13 (S.No.202), Patamata Village, Vijayawada Taluk, NTR District, Andhra Pradesh,
- having acquired the same from Late Smt. Kancharla Rushendra Mani, by her last WILL dated 20-09-2021. Thereafter, a Partition Deed bearing Document No.2255/2024 on the file of the Joint Registrar, Vijayawada, further solidified my Client□s ownership over the above-described property.
Therefore, it is hereby declared that the property above described is the self-acquired property of my Client, having acquired the same vide Document No. 2255/2024 on the file of the Joint Registrar, Vijayawada, and no other person has any vested interest in the said property.
Any person aggrieved shall raise their objections within 15 days from today.
**SANKU DURGA RAMACHANDRA RAO**
**ADVOCATE □ HIGH COURT OF ANDHRA PRADESH & TELANGANA**
**Flat No.207, 3rd Floor, KNR PRIME Apartments, Tadepalli, Guntur District, Andhra Pradesh - 522501**
**Phone No. 7673957702**

# గుర్రం జాషువాకు ఘన నివాళి

మచిలీపట్నంలో...

అవనిగడ్డలో...

గుడివాడలో...

**ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ :** సామాన్యుల హృదయాలను సైతం హత్తుకునేలా అందరికీ అర్థమయ్యే భాషలో తన పద్యాలు రచనలతో గుర్రం జాషువా తన ప్రత్యేకతను చాటుకున్నారని మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మచిలీపట్నం బుట్టాయిపేట మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో గుర్రం జాషువా 54వ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి మచిలీపట్నం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతథిగా పాల్గొన్న డిపో మేనేజర్ మాట్లాడుతూ జాషువా సమాజం నుంచి ఎదుర్కొన్న వివక్షతను కళ్ళకు కట్టినట్లు వివరించారన్నారు. ఈ సదస్సుకు సిపిఎం సీనియర్ నాయకులు సాహితీ స్రవంతి మచిలీపట్నం అధ్యక్షులు కొడాలి శర్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గబ్బిలం రచన ద్వారా సమాజంలోని అసమానతలు ఎత్తిచూపుతూ ఏ వర్గాన్ని నొప్పించకుండానే సమస్యని ప్రజలు గుర్తించి ఆలోచింపజేసే విధంగా రచన వ్యాసంగాలు ఖండ కావ్యాలు సీస పద్యాలు రచించిన ఘనత జాషువా కే సొంతం అన్నారు. యుటిఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు పి రాందేవ్ మాట్లాడుతూ తన చిన్నతనంలో తన తండ్రి జాషువా రచించిన శ్మశాన వాటిక పుస్తకాన్ని చదవమని చెప్పగా అందులోని పద్యాలు తనను ఎంతగానో ప్రభావితం చేసి భవిష్యత్తును తీర్చిదిద్దాయన్నారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేకత పోరాట సంఘం కష్ణా జిల్లా నాయకులు చీకటి రాజేష్, ఎల్ఐసి యూనియన్ నాయకులు వాసు, సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** గుర్రం జాషువా, సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి వేడుకలు అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. గురువారం గాంధీ క్షేత్రంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మతి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సదా కాటన్ గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారిరువురూ నేటి తరానికి ఆదర్శనీయులని తెలిపారు. డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనప రెడ్డి చంద్రశేఖర్, ఎలవర్తి చిన్న, కొండవీటి పాండు రంగారావు, కొట్టే విజయ్, గరికపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.అలాగే స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గుర్రం జాషువా సర్ ఆర్థర్ కాటన్ చిత్రపటాలకు నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ ఆధ్వ ర్యంలో పూల దండలు వేసి నివాళులర్పించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కొల్లూరి వెంకటేశ్వ రరావు, మండ వ బాలవర్ధిరావు, సుధాకర్ పాల్గొన్నారు **ప్రజాశక్తి - గుడివాడ :** అవమానాలు పొందిన చోటనే అఖండ సత్కారాలు అందుకున్న గుర్రం జాషువా చిరస్మరణీయుడని సాహితి స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర అన్నారు. గురువారం స్థానిక సందర్య భవనంలో గుర్రం జాషువ 54వ వరంతి సభకు లంకా సురేంద్ర అధ్యక్షత వహించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాంఘిక దురాచారాలపై కలాన్ని ఎక్కుపెట్టిన జాషువా స్ఫూర్తితో వర్ధమాన కవులు రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాహిత్యాభిమానులు అవిర్నేని వెంకటేశ్వరరావు, వసుధ బసవేశ్వరరావు, వి.కృష్ణకిషోర్, సిహెచ్ రూప, జిఎం పీటర్, కొమ్ము సురేష్ పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి-ఉంగుటూరు :** మధ్యాహ్న భోజనం పథకం కార్మిక సంఘం ఉంగుటూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సయ్యద్ మహబూబీ, చిరికి లక్ష్మిలు ఎన్నికయ్యారని సిఐటియు నాయకులు ధనశ్రీ అన్నారు. మండలంలోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో ఉంగుటూరు మండల మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం మండల మహాసభ జరిగింది. ఈ మహాసభలో ధనశ్రీ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వమే ఉచితంగా గ్యాస్ బండలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా సయ్యద్ మహాభూబీ, చిరికి లక్ష్మి, ఉపాధ్యక్షులుగా అన్నపూర్ణ, కోశాధికారిగా సుమతి, కమిటీ సభ్యులుగా నాగలక్ష్మి, చంటి, భవానీ, రంగనాయకమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అజ్మీర్ వెంకటేశ్వరావు, సిఐటి నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మతులు

**ప్రజాశక్తి-కంకిపాడు :** తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు ప్రధాన రహదారి భారీ వర్షాల కారణంగా నీటమునగడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టినట్లు ఎంఎల్ఎ బోడే ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన పనులను పర్యవేక్షించి మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు ఆక్రమణకు గురికావడంతో నీరుపారుదల లేక రోడ్డుపై నిలిచిపోతుందన్నారు. రానున్న కాలంలో తాడిగడప మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు.

మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాదు

లంకమ్మ ప్రసాదను సత్కరిస్తున్న దృశ్యం

## లంకమ్మ ప్రసాదుకు సత్కారం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** ప్రముఖ విద్యాసంస్థల అధినేత అశ్వరావు పాలెం గ్రామ సర్పంచ్ పి లంకమ్మ ప్రసాదును నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి సాయిబాబు సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 పథకంలో భాగంగా విద్యానికేతన్ సమస్త తరపున పదిమందిని అశ్వరావు పాలెం గ్రామ సర్పంచ్‌గా 18 మంది ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకొని ఆదర్శంగా నిలిచినందుకుగాను లంకమ్మ ప్రసాదును విద్య నికేతన్ పాఠశాల ప్రాంగణంలో గురువారం ప్రభుత్వం తరపున శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 లో భాగంగా ప్రవేశపెట్టిన పి4 పథకం సమాజంలో నిరుపేదలకు సాయం అందించాలని ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరికి మంచి వేదిక అని ప్రశంసించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు తోడుగా సమాజంలో సంపన్న కుటుంబాలు నిరుపేదలకు చేయూతనిస్తే 2047 నాటికి మన రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం మరియాదేవి ఎంఈఓ 2 అన్నపురెడ్డి పిచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## పాఠశాలలకు కంప్యూటర్లు అందజేత



**ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ మండలంలోని ఐడిబిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ ఫండ్స్ నుండి పట్టణంలోని ఎస్‌పిఎస్, ఆంధ్రా నలంద, ఎస్‌జివిఎస్‌జి ఉన్నత పాఠశాలకు, బేతవోలు, స్లేడర్‌పేటలలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలకు మొత్తం 8 కంప్యూటర్లను అందజేసినట్లు విద్యాశాఖ అధికారులు జగన్‌మోహ నరావు, బి.బాలాజీలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ సిజిఎం జానకిరామ్, జనరల్ మేనేజర్ సాయికష్ణ, బ్రాంచ్ మేనేజర్ ఆది శేషుకుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## పలుచోట్ల స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛసర్వేక్షణ గ్రామీణ-2025 సభ్యుల బందం గురువారం పర్యటించింది. ఈకార్యక్రమంలో భాగంగా సర్వేక్షణగ్రామీణ పర్యవేక్షకులు జి రవివర్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ కనపర్తి పవన్ కుమార్ గ్రామంలోని ఎంపీ ఎలిమెంటరీ రెగ్యులర్ పాఠశాల, ఎస్టీ ఏరియాలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, డ్రైనేజీలు, పలు గహాలను సందర్శించారు. అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, శానిటేషన్ పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం.ఎస్. కష్ణ పరమాత్మ ,పంచాయతీ కార్యదర్శి కే సోమేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏనుగు పుణ్యవతి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** పమిడిముక్కల మండలంలోని గురజాడ, తాడంకి, వేల్పూరు గ్రామాలలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య విషయాలు గురించి తెలుసుకున్నారు. ఎంపిడిఒ సీతారామరాజు ,శివ, సందీప్, శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఈవోపిఆర్‌డి డి. వెంకటేశ్వరరావు, దానంకి గ్రామ కార్యదర్శి భవాని తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల మండలంలో పర్యటిస్తున్న బృందం సభ్యులు

## కోటా శ్రీనివాసరావుకు నివాళి

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** నవ రసాలను అద్భుతంగా ప్రదర్శించగల విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు అని సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. మచిలీపట్నం భావతరంగిణి ఆధ్వర్యంలో స్థానిక చిత్రకళా సంసద్ భవనంలో గురువారం సాయంత్రం కోట శ్రీనివాసరావు సంస్మరణ సభ జరిగింది. బాలాజీ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ తెలుగు, కన్నడ, తమిళ, హిందీ మలయాళం భాషల్లో 750 చిత్రాలలో నటించి అనేక అవార్డులు, పద్మశ్రీ బిరుదు అందుకున్నారన్నారు. సినీ రంగంతో పాటు శాసనసభ్యులుగా రాజకీయ రంగంలో కూడా మంచి సేవలు అందించారని బాలాజీ అన్నారు. నట జీవితంలోను రాజకీయ జీవితంలోను నిజాయితీగా పనిచేసిన కోటకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇవ్వడం సముజతమని బాలాజీ అన్నారు. సామాజిక సేవా కార్యకర్త పి.వీ. ఫణికుమార్, బావ తరంగిణి అధ్యక్షులు భవిష్య, దూళిపాల శ్రీరామ్ చంద్ర మూర్తి, ఐటిఐ కాలేజీ కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్, వెనిగళ్ళ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన బుద్ధప్రసాద్

చంద్రబాబుతో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం కలిశారు. అమరావతిలోని సీఎం చాంబర్లో చంద్రబాబును కలసి తన తండ్రి, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాలు ఆగస్టు 4 నుంచి ఏడాది పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలో జరిగే శత జయంతి సభకు హాజరవుతానని ముఖ్యమంత్రి బుద్ధ ప్రసాద్‌కు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆర్ అండ్ బి రహదారుల పరిస్థితిని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు బుద్ధ ప్రసాద్ చెప్పారు.

## వినియోగదారుల సేవే లక్ష్యం

**ప్రజాశక్తి-ఉయ్యూరు :** బ్యాంక్ ఖాతాదారులకు సేవలను సత్వరమే అందించడం తమ ప్రధాన లక్ష్యమని ఐడీబీఐ బ్యాంక్ జోనల్ మేనేజర్ జానకీ రామన్ అన్నారు. గురువారం సాధారణ తనిఖీలలో భాగంగా ఉయ్యూరు ఐడిబిఐ బ్యాంకు ను సందర్శించారు. ఖాతాదారులు, డిపాజిట్లుడారులతో సమావేశాన్ని నిర్వహించి బ్రాంచ్ పనితీరు, ఖాతాదారులకు కావలసిన సేవలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో వ్యవసాయదారులకు సేవలను క్రాప్ లోన్లను ఏర్పాటు చేస్తామని, ట్రేడింగ్ లోన్లను అమలు చేయనున్నామని తెలిపారు. ఐడీబీఐ రీజనల్ మేనేజర్ ఆర్ సాయికష్ణ , బ్రాంచ్ మేనేజర్ కె అనుదీప్ పాల్గొన్నారు.

## రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ప్రజాశక్తి-ఉంగుటూరు :** పెదఅవుటపల్లి జాతీయ రహదారి పక్కన మతిస్థితితం లేని వ్యక్తి మృతిచెందాడని ఆత్కూరు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. అనారోగ్యంతో ఓ వ్యక్తి ( సుమారు 50) బాధపడుతూ పెద్ద ఆవుటపల్లి జాతీయ రహదారి మార్జిన్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండటంతో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. అతని చాతిపై రేఖా అను అక్షరాలతో పచ్చబొట్టు ఉందని, అతని గురించి ఎవరికైనా తెలిసిన ఎడల ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## గంజాయిని తరిమేద్దాం

**ప్రజాశక్తి-తిరువూరు:** యువతను పట్టి పీడిస్తున్న గంజాయి మహమ్మారని తరిమి కొట్టాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు తిరువూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డు వినాయక దేవాలయం నుండి రాజుపేట పొట్టి శ్రీరాముల విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి గంజాయికి దూరంగా ఉండండి, ఆరోగ్యాన్ని కాపాడుకోండి, గంజాయి మహమ్మారిని తరిమికొట్టండని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దుబ్బాకు వెంకటేశ్వరరావు, నాయకులు ప్రేమరాజు, బొమ్మసాని మహేష్, రేగళ్ల వీరారెడ్డి, కొలికపోగు చంటి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని దీపాలికి సన్మానం

**ప్రజాశక్తి-వత్సవాయి:** చదువుకు పేదరికం అడ్డు కాదని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణయ్య అన్నారు. మండలంలోని పోచవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో

2024-25 ఐదో తరగతి చదివి నవోదయ వేలేరు పాఠశాలలో సీటు సాధించిన గారెల్లి దీపాలికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చఅన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుధీర్, మధులత, యూటీఎఫ్ అధ్యక్షులు అజ్మీర్ శ్రీను, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు పి వెంకటేశ్వరరావు, పి శ్రీను, జిల్లేపల్లి సదానంద్, ఎస్కే హుస్సేన్, సిఆర్పి రవిబాబు పాల్గొన్నారు.

## గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

**ప్రజాశక్తి-కంచికచర్ల:** కంచికచర్ల మండలం పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మత్తు పదార్థాలపై శక్తి యాప్ పై అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థినుల పై సమాజంలో జరుగుతున్న దాడులు, వాటిని ఏ విధంగా ఎదురుకోవాలో, శక్తి యాప్ ఏ విధంగా ఉపయోగపడుతుందోనని విద్యార్థినిలకు శక్తి టీం ఏయస్ఐ బి హనుమయ్య వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు. నందిగామ ఏసిపి ఉత్తర్వుల మేరకు, కంచికచర్ల రూరల్ సిఐ చవాన్ పర్యవేక్షణలో కంచికచర్ల ఎస్సై బి రాజు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఏఎస్ఐ హనుమయ్య తెలిపారు.

## బూదవాడ అభివృద్ధికి 'అల్ట్రాటెక్' కృషి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** మండలంలోని బూదవాడ గ్రామ అభివృద్ధి కోసం అల్ట్రాటెక్ సిమెంట్ యూనిట్ తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా 60 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, సోలార్ స్ట్రీట్ లైట్లను స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అల్ట్రాటెక్ సౌత్ సీఓఓ అనిల్ బజాజ్, యూనిట్ హెడ్ శివరాజ్ వరదరాజన్, జి.మోహన్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం టైలరింగ్ మిషన్లు పంపిణీ చేశారు. ఇదే విధంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధిని కొనసాగించాలని ఎంఎల్ఏ కోరారు.

## మల్టీపర్పస్ హాల్‌కు ప్రారంభోత్సవం

**ప్రజాశక్తి జగ్గయ్యపేట**

పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సిఎస్ఆర్ (సామాజిక బాధ్యత) పథకం ద్వారా రూ.15.88 లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ హాల్‌ను గురువారం శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, అల్ట్రాటెక్ మ్యానుఫ్యాక్చరింగ్ సౌత్ సీఓవో అనిల్ బజాజ్, యూనిట్ హెడ్ శివరాజ్ వరదరాజన్, జి.మోహన్ కుమార్, యువ నాయకులు శ్రీరాం ధనంజయ చినబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాల సందర్శన సందర్భంగా పిల్లల అవసరాలను గుర్తించి అల్ట్రాటెక్ సంస్థను మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి కోరగా వారు వెంటనే స్పందించి రూ.15.88 లక్షలు మంజూరు చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. జగ్గయ్యపేట గురుకుల పాఠశాల రాష్ట్రంలో ఐదోస్థానంలో ఉండటం గర్వకారణమని, జిల్లాలో మొదటి స్థానంలో ఉన్న ఈ పాఠశాలలో ప్రవేశం పొందేందుకు ప్రతిభ ఒక్కటే ప్రామాణికమని చెప్పారు.

## 200 మందికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** వాసవ్య మహిళా మండలి, ది లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సహకారంతో కవులూరు గ్రామంలోని పంచాయితీ కార్యాలయం వద్ద నిమ్రా టీచింగ్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వైద్యులు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్రా హాస్పిటల్ డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ అస్మా తస్వీర్, డాక్టర్ శేషు మాధవ్, వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ రామారావు పాల్గొన్నారు.

## ఇంటింటికీ టిడిపి కరపత్రాలు పంపిణీ

తోటచర్ల గ్రామంలో పాల్గొన్న మంత్రి భరత్

**ప్రజాశక్తి-మైలవరం:** మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక 97 బూత్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేస్తున్న చేయబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్నట్లు స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని కొనకంచి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతల సీతారామయ్య, సామినేని రంగ పాల్గొన్నారు. తోటచర్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి భరత్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గడిచిన కొద్ది కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, పెన్షన్ల పెంపు, మహిళల డ్వాక్రా రుణ మాఫీ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రగతిశీల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతల సీతారామయ్య, మాజీ సర్పంచ్ వేముల సైదేశ్వర రావు, వేముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సిపిని కలిసిన నూతన ఎసిపి

**ప్రజాశక్తి-విజయవాడ:** సాధారణ బదిలీలలో భాగంగా శ్రీకాకుళం జిల్లా మహిళా పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పిగా పని చేస్తున్న బి.రాజశేఖర్ ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ క్రైమ్ ఏసిపిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

## 30 మందికి జరిమానా

**ప్రజాశక్తి-విజయవాడ:** స్థానిక 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 30 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఆరవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి లెనిన్ బాబు గారు మొత్తం 30 మందిలో నలుగురికి రూ.60,000, 26 మందికి రూ.2.60 లక్షలు జరిమానా విధించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కోరారు.

## పండ్ల తోటలకు సబ్సిడీ

**ప్రజాశక్తి-వత్సవాయి:** పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ చట్టం కింద ప్రభుత్వ సబ్సిడీ అందిస్తుందని తాసిల్దార్ ఎ.శాంతి లక్ష్మి తెలిపారు. మండలంలోని ముచ్చింతల, గుమ్మడిదూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు అవసరమైతే రైతు సేవ కేంద్రాల ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు

సూచించారు. ఈ క్రాప్ నమోదు పూర్తయితేనే పంటల భీమా వర్తిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను పాల్గొన్నారు.

## సిపిని కలిసిన ప్రొబిషనరీ ఎస్‌ఐలు

**ప్రజాశక్తి-విజయవాడ:** విశాఖపట్నం రేంజ్ గ్రేహౌండ్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌కు కేటాయించిన 54 మంది ప్రొబేషనరీ ఎస్ఐలు గురువారం పోలీసు కమిషనర్ కార్యలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, బాధితులకు న్యాయం, ముద్దాయిలకు శిక్షలు కల్పించేలా పని చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం సాధన, పోలీసులు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడానికి ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో విధులు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్తితులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పరిచినప్పుడు సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని తెలియజేశారు.ముఖ్యంగా ప్రతి ఒక్కరూ వీధి నిర్వహణలో టెక్నాలజీ ని ఉపయోగించి ఉత్తమ ఫలితాలను రాబట్టి ప్రజలకు మరింత సేవ చేసేలాగా చూడాలని, పి.జి.ఆర్.ఎస్. ఫిర్యాదులను అప్లోడ్ చేయు విధానం, ఎఫ్.ఐ.ఆర్., ధర్యాప్తుకు సంబంధించిన రికార్డులను రాయడం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి, కేసులను ఏవిధంగా చేధించాలి, సి.సి.టి.ఎన్.ఎస్., సి.ఈ.ఐ.ఆర్., సి.డి.ఆర్.అనాలసిస్, డ్రోన్స్ ను ఉపయోగించడం, క్లౌడ్ పెట్రోలింగ్, సి.సి.కెమెరాలను ఉపయోగించు విధానం గురించి, అస్త్రం యాప్ గురించి, ఈ పహరా బీట్ గురించి, ఎన్.డి.పి.ఎస్. కేసులలో చేయవలసిన విధుల గురించి, కేసు డైరీ రాయడం, నేర స్థలాన్ని ఏవిధంగా పరిశోధించాలి, సాక్ష్యాలను ఏవిధంగా సేకరించాలి, బంధోబస్త్ ఏవిధంగా వేయాలి, ఏ విధంగా నిర్వహించాలి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న వివిధ క్రైమ్ రికార్డ్స్ లను ఏ విధంగా నిర్వహించాలి మొదలగు అంశాల గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలని, ఎక్కడా ఏవిధమైన అనుమానం వచ్చిన వెంటనే సీనియర్ అదికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు సరిత, సిటీ ట్రైనింగ్ సెంటర్ ఏసిపి బి.ఉమామహేశ్వరరెడ్డి , సౌత్ డివిజన్ ఎసిపి డి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

# క్యూబా సంఘీభావ నిధికి విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-గన్నవరం : అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న క్యూబా సంఘీభావ నిధికి గురువారం ముస్తాబాద్ గ్రామంలో విరాళాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు, కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, గన్నవరం మండల కార్యదర్శి కైలే ఏసుదాసు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరిగి ప్రజల నుంచి విరాళాలు సమీకరించారు. క్యూబాకు సంఘీభావంగా దేశమంతా విరాళాలు సేకరణ జరుగుతుందని, ఈ ఉద్యమానికి ప్రజలు తమ వంతు సహకరించాలని హరిబాబు కోరారు. ప్రజల నుంచి 4 వేల రూపాయలు విరాళాలు వచ్చాయని చెప్పారు. ఈ నిధిని ఢిల్లీలోని క్యూబా సంఘీభావ నిధికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంతోని, ఇతర కౌలు రైతులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న కౌలు రైతు నాయకులు

వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## ఆక్రమణకు గురైన శ్మశానవాటికను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 4, 5, 6, 7 వార్డులకు సంబంధించి ఉన్న శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని ఆ వార్డులకు చెందిన ప్రజలు గురువారం కోడూరు మండల ఇంచార్జి తహసీల్దార్ జలగం సౌజన్య కిరణ్మయికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేముల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు వార్డులకు సంబంధించి గ్రామస్తులకు దహన కార్యక్రమాలను నిర్వహించు కోవడానికి వడ్డెర కాలనీలో దింటిమేరక రహదారిని అనుకుని శ్మశాన వాటిక ఉందని, ఈ శ్మశాన వాటిక చాలావరకు ఆక్రమణకు గురైందని సర్వే చేయించాలని కోరారు. అలాగే శ్మశానవాటికకు నూతన రహదారి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీహరి, ఉప్పు చిన్న వెంకటేశ్వరరావు, బండారు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం కొత్తమాజేరులో గుండేరు వంతెన అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ పనులను అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. గురువారం కొత్త మాజేరులో బుద్ధప్రసాద్ గ్రామస్తులు,అధికారులతో కలిసి మాట్లాడారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో దొనబండ క్వారీ నుంచి తెచ్చిన భారీ కొండ రాళ్లతో గండిని పూడ్చటంతో పాటు, వంతెనకు ఇరువైపులా మరోసారి కోత ఏర్పడకుండా రివిట్ మెంట్ పటిష్టంగా చేయాలని సూచించారు. గుండేరు మేజర్ డ్రైనేజీ ఎగువ నుంచే కాకుండా, గుండేరు పరిధిలోని మీడియం, మైనర్ డ్రైనేజీల నుంచి మాజేరు వంతెన వద్దకు కొట్టుకువచ్చి పేరుకుపోయిన గుర్రపు డెక్క, తొలగింపు పనులను నిరంతరాయంగా నిర్వహించి పూర్తి చేసిన డ్రైనేజీ శాఖ అధికారులను అభినందించారు. పీసీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, డీఈఈ బాబూ నాయక్, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతి, నాయకులు బొర్రా అగ్గిరాముడు, కమ్మిలి పెదబాబు, బండి నాగార్జున పాల్గొన్నారు.

## పాఠశాలకు సామాగ్రి వితరణ

ప్రజాశక్తి - పామర్రు : స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడిబిఐ.బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.జానకి రామన్ 1లక్ష 76 వేల విలువైన సామాగ్రిని గురువారం వితరణగా అందించారు. ఇందులో విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా భోజనం ప్లేట్లు 500, కుర్చీలు 25, టేబుల్స్ 20, ఫ్యాన్లు 10,సౌండ్ సిస్టం ఒకటి మొత్తంగా వీటి విలువ 1,76 వేల రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు .ఈ సందర్భంగా జానకీ రామన్ మాట్లాడుతూ తాను ఒకటి నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, ఆ మక్కువతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పొందిన ఉపకారాన్ని మరువక తిరిగి వారు చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ఐడిబిఐ.రీజినల్ మేనేజర్ కె.సాయి కృష్ణ, ఉయ్యూరు బ్రాంచ్ మేనేజర్ అనుదీప్ సాగర్, అసిస్టెంట్ మేనేజర్ బి.ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఈరోడ్డుపై ప్రయాణించేదెట్లా...

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలంలోని అయ్యంకి చెక్ పోస్ట్ నుండి పెడసనగల్లు గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. ఈ రోడ్డును బాగు చేయాలని విద్యార్థులు, వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

## కళాకారులకు తీన్మార్ డప్పులు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : తీన్మార్ డప్పు కళాకారులకు జన సైనికులు చేయూతనందించారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా చల్లపల్లి మం డల జనసేన పార్టీ ఆధ్వర్యంలో తీన్మార్ నూతనంగా నేర్చుకున్న మంగళాపురం యువకుల బందానికి రూ. 25 వేలు విలువ గల తీన్మార్ డప్పు వాయిద్యాలను గురువారం వితరణగా అందజేశారు. అనంతరం తీన్మార్ డప్పు వాయిద్యాలతో శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని మండలి వెంకట్రామ్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ కూటమినేతలు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సాత్విక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## విద్యార్థి దశ నుంచే సేవాతత్వం అలవర్చుకోవాలి : సాత్విక్

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రతిభ కలిగిన విద్యార్థులకు విదేశీ స్థాయి అందిస్తానని సాత్విక్ మురారి అన్నారు. గురువారం ఆయన తాను చదువుకున్న శ్రీ విజయ అకాడమీ విద్యార్థులతో కలసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పంచే గుణం అలవరచుకోవాలని, విద్యార్థినీ విద్యార్థులు బాగా చదువుకుని వద్దిలోకి రావాలని ఆకాంక్షించారు. తాను ఎన్నో కష్టాలు అనుభవించి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యను అభ్యసించి ప్రస్తుతం ఐర్లాండ్ లో వ్యాపారవేత్తగా స్థిరపడ్డానని తెలిపారు. పి4 భాగస్వామి సాత్విక్ శ్రీ విజయ అకాడమీ పూర్వ విద్యార్థి కావడం చాలా ఆనందదాయకంగా ఉందని కరస్పాండెంట్ ,జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ అన్నారు. అనంతరం సాత్విక్‌ను సత్కరించారు. ఎన్ఆర్ఐ, గొర్రెపాటి విద్యా ట్రస్ట్, శ్రీ విజయ అకాడమీ చైర్మన్ గొర్రెపాటి రంగ నాథ్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు పాల్గొన్నారు.

## సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి మాగాణి పొలాల్లో గట్లపై సాగు చేసుకోవటానికి రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. మండలానికి కేటాయించిన నాలుగు క్వింటాళ్ల విత్తనాలలో భట్ల పెనుమర్రు, కాజ-1, కాజ-2, కోసూరు సచివాలయాలకు 28 కిలోల చొప్పున మిగిలిన 12 సచివాలయాలకు 24 కిలోల చొప్పున కేటాయించారు. దీనిలో భాగంగానే మండల వ్యవసాయ శాఖ అధికారి బి సురేష్ బాబునాయక్ పర్యవేక్షణలో కూచిపూడి సచివా లయ వ్యవసాయ సహాయకురాలు.ఎం శ్రావణి పంచాయతీలో రైతులకు నూరు శాతం సబ్సిడీపై కంది విత్తనాలను అందజేశారు.

## రక్షిత మంచినీటి సరఫరా పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వడ్లమన్నాడు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న శానిటేషన్, రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణ ఈను ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ గురువారం పరిశీలిం చారు. తొలుత పంచాయతీ కార్యాలయం వద్ద ఇంటి పన్నుల నిర్వహణ డేటాను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలను అందజేశారు. అనంతరం శానిటేషన్ నిర్వహణలో భాగంగా చెత్త సేకరణను పరిశీలించారు. అనంతరం ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ ఎలా జరుగుతుందో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీటిని రక్షిత మంచినీటి ద్వారా గ్రామస్తులకు అందించే విధంగా ఆయా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఏజెయల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : సమాచార హక్కు చట్టం 2005 పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార అధికారి కె. చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో బుధవారం సహకార కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు శ్రీనివాసరావు, రాజేశ్వరి లు సమాచార హక్కు చట్టం 2005 లక్ష్యాలు గురించి వివరించారు. జిల్లా సహ కార ఆడిటర్ అధికారి పి.రాము, విభాగ సహకార అధికారి, మచిలీ పట్నం, గుడివాడ కార్యాలయం అప్పిలేట్ అధికారులు పాల్గొన్నారు.

# వరిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

- గన్నవరం మండల వ్యవసాయాధికారి శివప్రసాద్

ప్రజాశక్తి - గన్నవరం : వరి నారుమడిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే పైరు ఏపుగా ఎదుగుతుందని మండల వ్యవసాయాధికారి శివ ప్రసాద్ తెలిపారు. వర్షాలు కురిసి, కాలువలకు నీరు విడుదల చేయగానే డెల్టాలో రైతులు వరి నార్లు పోస్తారు. మెట్ట చెరువులకు నీరు రాగానే నాట్లకు సిద్ధమవుతారు. ఇప్పటికే బోర్ల కింద నాట్లు పనిలో రైతులున్నారు. రుతుపవనాలు రాకతో వర్షాలు గట్టిగా పడుతున్నాయి. చెరువులకు నీరు చేరుతుంది. సాగులో పెట్టుబడి తగ్గించుకుంటేనే రైతులు ఆర్థికంగా ఎదుగుతారు. ఈ సందర్భంగా వరి సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై గురువారం ఆయన ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ప్రశ్న:** వరి నారుమడిలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

**జవాబు:** ఈ ఖరీఫ్ సీజన్లో మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు అధికంగా వరి సాగు చేస్తారు. డెల్టా గ్రామాల్లో పూర్తిగా వేస్తారు. మెట్ట గ్రామాల్లో చెరువుల కింద సాగవుతుంది. నార్లు పోసే రైతులు ముందు గా 5 సెంట్ల నారుమడికి దమ్ములో 4.50 కిలోలు యూరియా, సూపర్ ఫాస్ఫేట్, 6.25 కిలోలు, పొటాష్ 1.70 కిలోలు చల్లుకో వాలి. వరిపైరు ఏపుగా పెరగ డంతో పాటు ఆరోగ్య వంతంగా ఉంటుంది.

**ప్రశ్న :** నారు తీసే ముందు పాటించాల్సిన పద్ధతులు ఏమిటి?

**జవాబు :** నారు తీసే పది రోజుల ముందు కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను నారుమడిలో చల్లుకోవాలి. అది మొక్కలోకి చేరుకుని 40 రోజుల పాటు ఉంటుంది. దీనివల్ల నాట్లు వేసిన తర్వాత 30 రోజులవరకు చీ డపీడలు పంటకు సంరక్షణ ఉంటుంది.

**ప్రశ్న:** మండలంలో వరి ఎంత సాగవుతోంది?

**జవాబు :** నీరు సంవృద్ధిగా ఉంటే మండలంలో వరి 17,500 హెక్టార్లలో సాగవుతోంది. కాలువకు నీరు వదిలితే అల్లాపురం, దావాజిగూడెం, బుద్ధవరం, బూతి మిల్లిపాడు, అజ్జంపూడి, కేసరపల్లి, జక్కులనెక్కలం, సా వరగూడెం గ్రామాల్లో వరి వేస్తారు. మెట్ట గ్రామాల్లో చెరువులకు నీరు వస్తే వరి వేయడం జరుగుతోంది.

**ప్రశ్న:** ఏఏ రకాల వరి విత్తనాలు సరఫరా చేస్తున్నారు?

**జవాబు :** మండలంలో బిపిటీ (సాంబామసూరి), ఎంటియూ1061 విత్తనాలు ఎక్కువగా వాడుతున్నారు. బి పిటి విత్తనాలు, ఎంటియూ 1061 రకం సరఫరా చేశాం.

**ప్రశ్న:** ఎరువుల సరఫరా ఏవిధంగా ఉంటుంది?

**జవాబు :** వరి-సాగు చేపట్టిన నాటి నుండే ఎరువుల అవసరం అవుతాయి. డిఏపి, సూపర్ పాస్పేట్ వంటి రకాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని కోఆపరేటివ్ బ్యాంకుల్లోనూ ఎరువులు ఇస్తున్నారు. మార్కెట్లో ఫుల్ గా ఉన్నాయి. ఎరువుల కొరత ఉండదు.

**ప్రశ్న:** కౌలు రైతుల పరిస్థితి ఏమిటి?

**జవాబు :** మండలంలో కౌలు రైతులు అధిక సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నాం. కౌలు గుర్తింపు కార్డులు జారీ చేస్తాం. సబ్సిడీ పథకాలు అందిస్తాం.

**ప్రశ్న:** చేల గట్లపై కందిసాగు వల్ల ఉపయోగం ఏమిటి?

**జవాబు :** వరి గట్లను కంది సాగుకు వినియోగించడం వల్ల పొలం గట్ల మీద ఉన్న నేలను సమర్ధవంతంగా ఉపయోగించుకుని రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. రైతుకు వరితో పాటు కంది అదనపు ఆదా యాన్ని ఇస్తుంది. గట్ల మీద వేసే కందికి అదనంగా ఎరువులు, పురుగు మందులు వేయనవసరం లేదు. వ రికి వేసిన వాటినే అది తీసుకొని అధిక దిగుబడిని ఇస్తుంది. ముఖ్యంగా గట్లపై కలుపు ఉధతి తగ్గడంతో పాటు తద్వారా తెగుళ్ల వ్యాప్తిని నివారిస్తుంది. గట్లపైవేయడానికి అభయ అనే రకం అనువుగా ఉంటుంది.

# సైబర్ మోసాల నివారణపై అవగాహనా సదస్సులు

## ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మోహనకృష్ణ

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలను రక్షించేందుకు ఏపీటీఎస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. గురువారం విజయవాడ ఆర్అండ్‌బి బిల్డింగ్‌లోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 24 గంటలూ ఐటీ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను పర్యవేక్షిస్తూ ముందస్తు హెచ్చరికలు అందిస్తూ ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) కీలక భూమి పోషిస్తుందన్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ అవగాహనా సదస్సులు నిర్వహిస్తామన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంపై ఆసక్తి ఉన్న గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థులుచ ఐటి నిపుణులకు రాష్ట్రస్థాయి సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ ను నిర్వహించామని, అందులో ఎంపికైన వారికి ఆరు నెలలపాటు సైబర్ సెక్యూరిటీలో శిక్షణ ఇచ్చామని చెప్పారు. సైబర్ సెక్యూరిటీలో నిపుణులుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి దేశ, విదేశాల్లో అనేక ఐటి కంపెనీల్లో అవకాశాలున్నాయని అన్నారు. ఏపీటీఎస్ తన సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సేవలను ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేట్ సెక్టార్‌లోకి కూడా విస్తరించాలని అంతేకాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా ఏపీకి సైబర్ సెక్యూరిటీ ఆడిటింగ్ మీద వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సెక్యూర్డ్ డిజిటల్ ఫ్యూచర్‌గా నిర్మించడానికి యువతను నడిపించే లక్ష్యంగా ఏపీటీఎస్ పని చేస్తుందని చెప్పారు.

## అచ్యుతానందన్‌కు నివాళి

**ప్రజాశక్తి-వత్సవాయి:** కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు సిపిఎం నాయకులు నివాళులర్పించారు. మండల కేంద్రమైన వత్సవాయి సిపిఎం కార్యాలయంలో అచ్చుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ సిపిఎం అగ్రనేతగా పార్టీ ఏర్పాటులో ఒకరైన విఎస్ అచ్చుతానందన్ కేరళ మాజీ ముఖ్యమంత్రిగా దేశవ్యాప్త గుర్తింపు కలిగిన నాయకుడిగా ఎదిగారన్నారు. ప్రజల మనిషిగా ఆఖరి శ్వాస వరకు ప్రజల కోసం పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగుల వెంకటేశ్వర్లు, వెంటి వెంకయ్య, భూతుపల్లి బిక్షం, షేక్ నాగుల మేరా, వేగినేటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

**ప్రజాశక్తి-కంచికచర్ల:** కంచికచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి విద్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ డాక్టర్ వై జగన్మోహన్ రావు జ్ఞాపకార్థం ఈ వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 400 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా పది మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, వారికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు, పాఠశాల డైరెక్టర్ పి రమేష్, సభ్యులు కోనేటి శ్రీను, వెంకటప్పయ్య, వైద్యులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పంపిణీ

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** తిరుమలగిరి గ్రామానికి చెందిన వనం మారయ్య ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడలోని ప్రైవేట్ హాస్పటల్‌లో చికిత్స పొందారు. ఆసుపత్రి బిల్లుల భారంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సాయం అందేలా తగిన చర్యలు చేపట్టారు. చెక్కును గురువారం ఎమ్మెల్యే రాజగోపాల్ నివాసంలో ఆయన సోదరులు శ్రీరాం సాయిప్రసాద్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

## కిసాన్ డ్రోన్లు పంపిణీ

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కిసాన్ డ్రోన్ పథకం కింద రూ.9.80 లక్షలు విలువ గల డ్రోన్లను ఏడుగురు రైతులకు గురువారం శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్రోన్లు శ్రమను తగ్గించడమే కాక, సమయాన్ని ఆదా చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కట్టా నరసింహారావు, ఏడి భవాని పాల్గొన్నారు.

# గ్రంథాలయ పితామహుడు అయ్యంకి జయంతి

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** గ్రంథాలయాలు ఉన్నంతకాలం అయ్యంకి వెంకట రమణయ్య సజీవంగా ఉంటారని ఎపి పౌర గ్రంథాలయాల సంచాలకులు ఎ.కృష్ణమోహన్ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో సర్వోత్తమ గ్రంథాలయంలో జరిగిన సభలో కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రంథాలయాల స్థాపనకు ప్రజలను ప్రోత్సహించేందుకు భిన్న మార్గాలను ఎంచుకొని పట్టుదలతో అన్నిటిలోను విజయాలను సాధించిన అయ్యంకిని ప్రతి గ్రంథాలయ కార్యకర్త, గ్రంథపాలకుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ గుత్తికొండ శ్రీరాములు మాట్లాడుతూ విద్య, గ్రంథాలయాలను ప్రోత్సహించని సమాజం అభివృద్ధి చెందదని, విజ్ఞాన ఫలాలు అందరికీ అందుబాటులోకి రావని అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడు కేశవరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో 11 కళాశాలల విద్యార్థులు పోటీ పడగా ప్రథమ స్థానాన్ని దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, ద్వితీయ స్థానాన్ని మెరిస్టెల్లా కళాశాల, తృతీయ స్థానాన్ని ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. వీరికి బహుమతులు అతిథులు అందించారు.

**తిరువూరు:** గ్రంథాలయోద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గురువారం గ్రంథపాలకురాలు కె.పద్మావతి విద్యార్థులతో కలిసి నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటరమణయ్య నిర్వహించిన గ్రంథాలయోధ్యమం స్వాతంత్రోద్యమానికి ఊపిరి పోసిందన్నారు.

## గెలాక్సీ వాచ్-8 ప్రీ ఆర్డర్లు ప్రారంభం

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** సామ్‌సంగ్ గెలాక్సీ వాచ్ 8, క్లాసిక్‌లను విడుదల చేసిందని సంస్థ మార్కెటింగ్ హెడ్ శ్రీనివాసన్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీలోగా గెలాక్సీ వాచ్ 8 సిరీస్‌ను ప్రీ బుకింగ్ చేసుకునే వినియోగదారులు మల్టీ బ్యాంక్ క్యాష్‌బ్యాక్ లేదా రూ.12 వేల వరకు అప్‌గ్రేడ్ బోనస్‌లు లేదా రూ.15 వేల వరకు మల్టీ-బై ఆఫర్‌లతో సహా అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చన్నారు.

## ఏసర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ అవుట్‌లెట్ ప్రారంభం

**ప్రజాశక్తి -విజయవాడ అర్బన్:** నగరంలోని వెటర్నరీ కాలనీ నందు ఏసర్ ఎలెక్ట్రిక్ వెహికల్ షోరూం ఈ బైక్ గో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా షోరూం సిఈవో హరికిరణ్ మాట్లాడుతూ ఈ స్టోర్ ఏసర్‌తో బ్రాండ్ లైసెన్సింగ్ భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి చేయబడిన అత్యాధునిక ఏసర్-బ్రాండెడ్ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శిస్తుందని తెలిపారు. వివిధ రాష్ట్రాలలో ఏసర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ రిటైల్ అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయాలనే వ్యూహాత్మక విధానం ఆధారంగా కొన్ని నెలల్లోనే సాధ్యమైందని తెలిపారు. ఈ సైకిళ్ల ధర రూ.35,999 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు.

## ఎస్‌సి మహిళకే పదవి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** జగ్గయ్యపేట మార్కెట్ యార్డు ను ప్రభుత్వం ముందుగా ఎస్సీ మహిళకు కేటాయించింది. దానిని మార్చి ఓసికి కేటాయించడంపై ఎస్సీ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ హై కోర్టులో ఎస్సీ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. గురువారం వాదనలు విన్న కోర్టు ఇది చాలా అమానుషమని దీనిని మార్చడానికి వీలు లేదని వెంటనే ఎస్సీ మహిళకు జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్‌ను కేటాయించాలని తీర్పు వెలువరించింది.

## 240 మందికి పరీక్షలు

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** అవసరానికి మించి అతిగా సెల్‌ఫోన్లు వినియోగించటం ఆరోగ్యానికి హాని చేస్తాయని డా. జాకీర్ హుస్సేన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ తెలిపారు. స్థానిక డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ఆవరణలో గురువారం మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక కౌన్సిలర్ అమ్మాజీ మాట్లాడుతూ మన ఇంటి శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఆప్తమాడిస్ట్ ఎండి పాషా మాట్లాడుతూ 240 మందికి కంటి పరీక్షలు చేయగా 15 మందికి కంటి శుక్లాలు 11 మందికి రెటీనా సమస్యలు ఉన్నట్టు గుర్తించామన్నారు. శిబిరాన్ని పర్యవేక్షించిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్ వలి మాట్లాడుతూ చిరుతిండ్లను తగ్గించి పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తింటూ వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వల్లభనేని నాగ పవన్ కుమార్, సాప్లిక్ ఈవెంట్ ఫోటో గ్రాఫి మేనేజర్ సుభాని, అధ్యాపకులు సంతోష్ జ్యోతి, ఆలీ, బేగ పాల్గొన్నారు.

# పాలేరు, మనేరులకు వరద నీరు

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట** అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలకు తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలోని పాలేరు వరద నీటితో పరువళ్లు తొక్కుతుంది. వరద నీటితో పాలేరు పరిసర ప్రాంత గ్రామాలైన తక్కెళ్ళపాడు, గరికపాడు, బలుసుపాడు, రెడ్డినాయక్ తండ, బూదవాడ, కె అగ్రహారం, రావిరాల ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తెలంగాణ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు మున్నేరు సైతం ప్రమాద భరితంగా ప్రవహిస్తుంది. దీనితో మున్నేరు పరిసర ప్రాంతాల గ్రామాలకు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

**వత్సవాయి:** గత నాలుగు రోజుల నుండి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పోలంపల్లి మున్నేరు డ్యామ్ పొంగి ప్రవహిస్తుంది. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా పాకాల చెరువు దగ్గర్నుంచి వస్తున్న వరద రాజోలు మీదుగా ఖమ్మం జిల్లాలో ప్రవహిస్తూ వరద నీరు పోలంపల్లి రాజీవ్ మునేర్ చెక్ డ్యామ్‌కు వచ్చి చేరుతుంది. లింగాల కాజ్‌వే వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వాహనదారుల్ని వెళ్లకుండా రెవెన్యూ, పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కాజ్‌వే వద్ద దిగువకు 8 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది.

**ఇబ్రహీంపట్నం:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం కొండపల్లి గ్రామం శాంతినగర్ బుడమేరు వాగును పరిశీలించారు. గతంలో గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ ఇన్ స్పెక్టర్ మనోజ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పోలంపల్లి వద్ద ప్రవహిస్తున్న నీరు

# మసకబారుతున్న పోలీస్ నిఘా

**• నిరుపయోగంగా సిసి కెమెరాలు • కేసుల ఛేదనలో వైఫల్యం**

**ప్రజాశక్తి-చల్లపల్లి** : శాంతి భద్రతల పరిరక్షణకు అడుగడుగునా పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించినా, వాటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించడం సమస్యగా మారుతోంది. ఈ కారణంగా కొన్ని సందర్భాల్లో కేసుల చేదనలో పోలీసు వైఫల్యం చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఓ ప్రమాద దర్యాప్తును పరిశీలించినప్పుడు ఈ విషయం తేటతెల్లం అవుతుంది.

పామర్రు- చల్లపల్లి రోడ్డు వక్కలగడ్డ మధురం హెూమ్ ఫుడ్ సమీపంలో మే 14 వ తేదీన ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని ఓవర్ టెక్ చేస్తూ మరో ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పారు. ముందు వెళుతున్న వాహనదారుడి సైలెన్సర్ ,హ్యాండిల్ ను తాకారు. ముందు వెళుతున్న వాహన దారుడు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. హెల్మెట్ ఉండటంతో ప్రాణాలకు ముప్పు తప్పింది. కాళ్ళు, చేతులకు తీవ్ర గాయల య్యాయి. వెనుక నుండీ ఢీ కొన్న వాహనదారుడు ఆపకుండా వేగంగా వెళ్ళిపోయారు. సమీపంలోని వారు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు . విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి వద్ద పోలీసులు పిర్యాదు నమోదు చేసుకుని స్తానిక స్టేషన్ కు ఆ రిపోర్ట్ పంపారు.

**మసక బారిన నిఘా**

సీసీ కెమెరాలను పరిశీలించి ఈ కేసును ఛేదించేందుకు పోలీసులు ప్రయత్నించారు. తొలుత ఈ ఘటన జరిగిన ప్రాంతానికి కొద్ది దూరంలోని రైస్ మిల్లు సీసీ కెమెరాను పరిశీలించారు. దీనిలో ఘటన సమయానికి కొద్ది సెకన్ల ముందు రోడ్డుపై వెళుతున్న రెండు వాహనాలు , వాటిపై ఉన్న వ్యక్తులు అస్పష్టంగా కనిపించారు. వాహన నంబర్లు కనిపించలేదు. అయితే వక్కలగడ్డలో ఈ ఘటన జరిగిన సమీపంలోని విద్యుత్ స్తంభంతో పాటు చల్లపల్లి వరకు అమర్చిన సీసీ కెమెరాలు ఎక్కడా పని చేయకపోవడంతో ప్రమాద ఘటనకు కారణమైన వాహనం, వ్యక్తి ఆచూకీ తెలవకుండాపోయింది.

**టెక్నాలజీ నిర్వహణ అవసరం**

అయితే పైఘటన పరిశీలించినప్పుడు సాంకేతికతను ఏర్పాటు చేయడానికే యంత్రాంగం పరి మితం అవుతుందనీ, నిర్వహణను యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందనే విషయం తేటతెల్లం అవుతుంది. తాజాగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగి స్తున్నాము. డ్రోన్ల సహాయంతో అసాం ఘీక శక్తుల ఆటకట్టిస్తున్నాము . అని పోలీసులు సాంకేతిక హంగుల గురించి రోజు ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో టెక్నాలజీ నిర్వహణ లోపాలు లేకుండా యంత్రాంగం చర్యలు చేపట్టి కీలక కేసులు ఛేదించే దిశగా పురోగతి సాధించాలని పలువురు కోరుతున్నారు.

### పిల్లల మానసిక ఎదుగుదలలో
## తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

**• భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు నిరుపమ**

**ప్రజాశక్తి-తోట వల్లూరు** : పిల్లల మానసిక ఎదుగుదలకు తల్లిదం డ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు గుత్తికొండ నిరుపమ అన్నారు. గురువారం ఆమె మాట్లా డుతూ పిల్లల జీవితంలో మానసిక వికాసం ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుం దన్నారు.. ఇది వారి భావోద్వేగాలు, ఆలోచనలు, సామాజిక సంబంధాలు, వ్యక్తిత్వ వికాసానికి పునాది వేసే ప్రక్రియన్నారు. చిన్న వయసులోనే మంచి మానసిక అభివద్ధి జరగాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి ప్రయత్నించాలని తెలిపారు.అలాగే పిల్లలు ప్రేమ, భద్రతతో కూడిన వాతావరణంలో పెరిగితే, వారి మనసు శాంతిగా, ధైర్యంగా ఉండి కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఆసక్తి పెరుగుతుందన్నారు. వారిని నిత్యం ఉత్సాహపరిచే మాటలు చెప్పడం ముఖ్యంఅన్నారు. పిల్లల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని, వారికి ఓ సమస్య గురించి వివిధ కోణాల్లో ఆలోచించేందుకు అవకాశం ఇవ్వాల న్నారు. ఇది క్రియాత్మక ఆలోచనను పెంచుతుం దన్నారు. నిర్వచనాత్మకమైన కథలు, పుస్తకాలు చదివించాలన్నారు. చిన్న చిన్న కథలు, బాలసాహిత్యం వారి ఊహాశక్తిని, భాషా పరిజ్ఞానాన్ని, నైతిక విలువలను పెంచుతుందని,. ప్రతి రోజు వారితో కథలు చదవడం అలవాటు చేయాలని, ఆటలు, కళా ప్రదర్శనలు ప్రోత్సహిం చాలన్నారు. ఓపిక, సమయం విలువ, సహనశీలత, సహాయం వంటి విలువలను చిన్న వయసులోనే నేర్పా లని, తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయం వారితో కేటాయించాలని, వారి భావాలను తెలుసుకోవాలన్నారు.

## 27 నుంచి తిరునక్షత్ర వేడుకలు

**ప్రజాశక్తి - గుడివాడ** : పట్టణంలో ప్రసిద్ధిగాంచిన జగన్నాధపురంలోని శ్రీ భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 27వ తేదీ నుండి శ్రీ గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవ స్థానం ఈవో కందుల గోపాలరావు తెలిపారు. గురు వారం స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో వేడుకల నిర్వహణపై దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణరావు, భక్తులు, ధార్మిక సంస్థల సభ్యులతో కలసి ఇఓ గోపా లరావు మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా అమ్మవారికి సారెను సమర్పిస్తామన్నారు.

# సుపరిపాలన కరపత్రాలు పంపిణీ

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యం, మండల పరిధిలోని పులిగడ్డ గ్రామాలలో గురువారం నిర్వహిం చారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పులిగడ్డ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ అభివద్ధి కార్యక్రమాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మండల బాలవర్ధిరావు, కర్ర సుధాకర్, మెండు లక్ష్మణరావు, మెగా వత్తు గోపి, పరుచూరి దుర్గాప్రసాద్, మండలి రామ్మోహన్‌రావు, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు హనుమాన్ కటికల బాలాజీ షేక్ బాబా వలి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు గుడివాక శివరావు, టిడిపి నాయకులు అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ, టి సి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, బడే సుబ్బారావు, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ డేగల రాఘవ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : సుపరిపా లనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు పట్టణ పార్టీ అధ్యక్షులు జంపాన గుర్నాథరావు ఆధ్వర్యంలో ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో పంతొమ్మిదవ వార్డు లో గురువారం తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ

అవనిగడ్డ మండలంలో...

ఉయ్యూరు మండలంలో...

శాసనమండలి సభ్యులు వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ వల్లభనేని సత్యన్నారాయణ, మాజీ చైర్మెన్ పూలా ,కుద్దుస్ పిఏసిఎస్ చైర్మెన్ కూనపరెడ్డి వాసు, హాస్పిటల్ చైర్మెన్ జయదేవ్, శివాలయం చైర్మెన్ కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న అధికారులు

## విద్యార్థులకు క్విజ్ పోటీలు

**ప్రజాశక్తి - గుడివాడ** : ఆదాయపుపన్ను శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆదాయపుపన్ను అధికారులు ఉయ్యూరు సందీప్, ఆర్ఎస్ఆర్ మూర్తి, ఇన్‌స్పెక్టర్లు సురేష్‌బాబు, ఎవి రవికుమార్‌లు విద్యార్థులకు ఆదాయపు పన్నుల ఆవశ్యకతపై అవగాహన సదస్సును నిర్వహించి, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంశ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ ఎంఆర్ ప్రసాద్, కళాశాల కరస్పాడెంట్ కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బందికి సత్కారం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండలంలోని చంద్రాల గ్రామ పంచాయతీలో ఇటీవల బదిలీఅయిన కార్యదర్శి చాపరాల రాజేష్, పలువురు సచివాలయ సిబ్బందికి శుక్రవారం గ్రామ సర్పంచ్ సత్కరించారు. గ్రామపంచాయతీలో అత్యుత్తమ సేవలందించిన వీరిని అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అర్జున్ రావు, వీఆర్వో భాస్కరరావు, టిడిపి నాయకులు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి మంగినపూడిలో మొబైల్ పాస్‌పోర్టు కేంద్రం

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఆధ్వర్యంలో మచిలీపట్నం మండలం మంగినపూడి లైట్ హౌస్ సమీపంలో మొబైల్ పాస్పోర్ట్ సేవా కేంద్రం ఈ నెల 29, 30వ తేదీల్లో జరుగుతుందని మచిలీపట్నం మండల ఎంపీడీఓ సి హెచ్ వెంకటేష్ తెలిపారు. ఎవరికైనా పాస్పోర్ట్ అవసరం ఉంటే 1500 రూపాయలు చెల్లించి ఎంపీడీవో ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, విజయవాడ వెళ్లకుండానే మంగినపూడిలో పాస్పోర్ట్ మంజూరు చేస్తారన్నారు. ఎవరికైనా అత్యవసరంగా పాస్పోర్ట్ కావాలనుకుంటే ఆధార్, పాన్, ఓటరు ఐడి, పదో తరగతి క్లాస్ మార్క్స్ లిస్ట్ ,మెయిల్ ఐడి ,ఫోన్ నెంబర్ తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు 91 78936 01268 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని కోరారు. **ప్రజాశక్తి- మొవ్వ** : ఈనెల 28వ తారీఖున కూచిపూడి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య పీఠంలో నిర్వహించే పాస్పోర్ట్ నమోదు కార్యక్రమాన్ని ఉపయోగించు కోవాలని అసిస్టెంట్ పాస్పోర్ట్ అధికారిణి వల్లభ జోశ్యుల విజయలక్ష్మి (విజయవాడ) తెలిపారు. గురువారం ఆమె కళా పీఠంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు పాస్పోర్ట్ సేవలను మరింత చెరువు చేయడం కోసమే కష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనలతో మొబైల్ సర్వీస్ నిర్వహిస్తు న్నామని వివరించారు. జూనియర్ పాస్పోర్ట్ అసిస్టెంట్ నడుపల్లి సూర్య కార్తీక్, నాట్యకళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, సర్పంచ్ భర్త కొండవీటి అమరబాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యంకి వెంకట రమణయ్యకు నివాళి

**ప్రజాశక్తి-గన్నవరం** : గన్నవరం ప్రధమశ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని నిర్వహించారు. ఎంపీ యుపి మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సువార్తరాణి, గ్రంథాలయాధికారి కె. నాగరాజు, యుపి స్కూల్ టీచర్ లత, విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

## ఉలవలపూడి గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండలం లోని ఉలవ లపూడి గ్రామాభివృద్ధికి సహక రించాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయ ణరావును ఆ గ్రామ సర్పంచి పామర్తి కన్య భాస్కరరావు కలిసి విన్నవించారు. గురువారం మచిలీపట్నంలో వారిని కలిసినట్లు సర్పంచి భాస్కరరావు తెలిపారు. పామర్తి రామయ్య, పామర్తి అశోక్ కుమా ర్, నారగాని వెంకట గంగాధరరావు కలిసిన వారిలో ఉన్నారు.

## రేవతి థియేటర్ వద్ద ఘర్షణలు అవాస్తవం

**ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్** : పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం ప్రీమియర్ షో సందర్భంగా పోలీసులకు అభిమానులకు మధ్య ఘర్షణ జరిగిందని సామాజిక మాధ్యమాలలో వస్తున్న ప్రచారం పూర్తి అవాస్తవమని రేవతి థియేటర్ యాజమాన్యం గురువారం ప్రకటన విడుదల చేసింది.. బుధవారం సాయంత్రం హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ సందర్భంగా ప్రీమియర్ షోకు రేవతి థియేటర్ కు అభిమానులు, ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చానీ, సినిమా చూడాలనే ఉత్సాహంతో ఒకేసారి అభిమానులు అందరూ థియేటర్లోనికి చొచ్చుకు రావడంతో థియేటర్ అద్దం స్వల్పంగా ధ్వంసం అయిందని అంతకుమించి పెద్దగా నష్టం జరగలేదని తెలిపింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అభిమానులందరినీ ఒక క్రమ పద్ధతిలో థియేటర్లోనికి పంపి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారన్నారు.

## చదరంగం విజేత కొల్లా భావన్

**విజయవాడ:** అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా సరస్వతి సామ్రాజ్యం ట్రస్ట్, కృష్ణాజిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లాల చదరంగం పోటీలకు రెండు జిల్లాల నుంచి మారుమూల ప్రాంతాల నుంచి సుమారుగా 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను రాష్ట్ర పౌర గ్రంథాలయం సంచాలకులు ఎ.కృష్ణమోహన్ ప్రారంభించారు. ఠాగూర్ గ్రంథాలయం లైబ్రేరియన్ కె.రమాదేవి, జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి మందుల రాజీవ్ న్యాయ నిర్ణేయతగా వ్యవహరించారు. కొల్లా భావన్ 7/7 పాయింట్లతో ప్రథమ, మాధవ 6/6 పాయింట్లతో ద్వితీయ, వేదాంత్ 6/6 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. అండర్ 8, 10, 12, 14 కేటగిరిలో మొదటి పది స్థానాలకు ట్రోఫీలు, మెడల్ సర్టిఫికెట్లతో సత్కరించారు.

## దుర్గగుడిలో ఉత్సవాలు పూర్తి

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ :** విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాడ సారె మహోత్సవాలు గురువారంతో పరిసమాప్తమయ్యాయి. గత నెల 26 నుండి ఈ నెల 24వ తేదీ వరకు నెల రోజుల పాటు వివిధ దేవాలయాలు, ధార్మిక సంస్థలు, భక్త సమాజములచే అమ్మవారికి ఆషాడ సారె సమర్పించారు. గురువారం వైదిక సిబ్బంది తరపున స్థానాచార్య, ప్రధాన మరియు ఉప ప్రధాన అర్చకులు, ముఖ్య మరియు అర్చకలు, పరిచారికులు, వైదిక సిబ్బంది, వేదపండితులు అమ్మవారికి సారె సమర్పించారు. సారెతో పాటు అమ్మవారికి కానుకగా 40 గ్రాముల బంగారు హారం కార్యనిర్వహణధికారివారి వి.కె.శీనానాయక్ చేతికి అర్చకులు తరుపున విరాళంగా అందజేశారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

**ప్రజాశక్తి-విస్సన్నపేట:** స్థానిక శ్రీశ్రీ విద్యాసంస్థలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై జి రామకృష్ణ మాట్లాడుతూ యువత మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని వాటికి అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మత్తు పదార్థాలు విక్రయించుట మరియు వినియోగించడం చట్టరీత్యా నేరమని ఇందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. అంతేకాక ర్యాగింగ్ చేయకూడదని ప్రతి ఒక్క విద్యార్థి ర్యాగింగ్ చేసి ఎదుటివారిని ఇబ్బంది పెట్టకూడదని అలా చేసిన ఎడల శిక్షార్హులవుతారని తెలిపారు.

# స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించాలి

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** వచ్చే నెల 29న నేషనల్ స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించాలని క్రీడా శాఖా మంత్రి ఎమ్.రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ రవినాయుడుని గురువారం ఆదేశించారు. ఏపీ సెక్రటేరియట్ లో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో చేపట్టిన క్రీడాభివద్ధిని, విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్పోర్ట్ డేను ఘనంగా నిర్వహించాలని సూచించారు. అలాగే క్రీడల అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. అనంతరం శాప్ ఛైర్మన్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎస్.సవితలను కలిశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో క్రీడల అభివద్ధి, క్రీడా సదుపాయాల కల్పన, ట్రైబల్ స్పోర్ట్స్ స్కూల్, ట్రైబల్ స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటుకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులను సమకూర్చి గిరిజన క్రీడాకారులకు మెరుగైన క్రీడా సదుపాయాలను కల్పించాలని కోరారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో ఎస్సీ కాంపౌండ్ కింద సబ్ ప్లాన్ నిధులను వినియోగించి క్రీడామైదానాల అభివృద్ధి, క్రీడా

సదుపాయాల కల్పన, కేవీకేల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ వెల్ఫేర్ శాఖ ద్వారా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో క్రమంగా క్రీడలను ఆడించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆశాలకు పెండింగ్ జీతం చెల్లించాలి : కమల

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ**

విజయవాడ వెస్ట్ సిటీ ఆశ వర్కర్ల మహాసభ ఎంహెచ్ భవన్‌లో టి.హవీలకుమారి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల మాట్లాడుతూ టెక్నికల్ సమస్యల వల్ల ఆశ వర్కర్లకు జూన్ నెలలో అందాల్సిన జీతాలు ఆగాయని, టెక్నికల్ సమస్యను సరిచేసి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై నెల చివరికి వచ్చినా జిల్లా అధికారులు టెక్నికల్ సమస్యను ఎందుకు సరి చేయలేదని ప్రశ్నించారు. టెక్నికల్ సమస్యను సరి చేయకుండా ఆ పేరుతో జూలై నెల జీతం కూడా ఆగే పరిస్థితి కల్పించవద్దని, ఇప్పటికే జూన్ నెల జీతం అందక ఆశ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం 15 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా ఎ.కుమారి, కార్యదర్శిగా హవీలకుమారి, కోశాధికారిగా ఎస్.హేమ కుమారిలతో పాటు సుజాత, సుగుణ వేణి, దుర్గ, రాజామణి, నాగలక్ష్మి, శివకుమారి, అరుణ, భవాని తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంతో వెస్ట్ సిటీ సిఐటియు కార్యదర్శి ఈ.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుమారి

హవీలకుమారి

## సిఎం సహాయ నిధి పంపిణీ

**ప్రజాశక్తి-విజయవాడ:** స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీ కు చెందిన పలువురికి రూ.1.32 లక్షలు విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు లబ్దిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉండి వైద్యం చేయించుకోలేని వారికి చేయూతనిస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిది అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘంటా కృష్ణమోహన్, డివిజన్ అధ్యక్షులు బేవర సూరి పాల్గొన్నారు.

## లక్ష్మయ్య వాగుపై వంతెన ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి-కంచికచర్ల:** కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగుపై వంతెన నిర్మించి, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని బీఎస్పీ ఎంపిటిసి బత్రె ఉదయ్‌కిరణ్ కోరారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు పొంగి చెవిటికల్లు వద్ద రోడ్డు పై ప్రవహిస్తుండగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మేరకు గురువారం వాగు ఉధృతిని పరిశీలించిన దయ్ కిరణ్ నందిగామ ఎమ్మెల్యే తంగీరాల సౌమ్య కు బహిరంగ లేఖ రాశారు. వర్షాకాలంలో ముమ్మరంగా వర్షాలు కురిస్తే గ్రామంలోని లక్ష్మయ్య వాగు పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని ఆరోగ్యపరంగా ఏమైనా అత్యవసరమైతే ప్రజలు ఇక చనిపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కూడా ఈ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా అలసత్వం వహించిందని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా లక్ష్మయ్య వాగుపై వంతెనను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన లక్ష్మయ్య వాగుపై వంతెనను ఏర్పాటు చేయాలని కోరారు.

## యుజిడి పనులు త్వరగా పూర్తి చేయాలి : సత్యబాబు

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** 51 డివిజన్లోని గొల్లపాలెం గట్టు, మహంతిపురం ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు సిపిఎం కార్పొరేటర్ బోయి సత్య బాబు వెల్లడించారు. గురువారం డివిజన్‌లోని మహంతీపురం జాడాపాపయ్య వీధి లో జరుగుతున్న యుజిడి పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలుతో పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అదేవిధంగా డివిజన్లో మంచినీటి సరఫరా పైపులైను నిర్మాణపు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ పర్యటనలో 50వ డివిజన్ శానిటరీ సెక్రటరీ ఆలీ, శానిటరి వర్కర్ చందు, స్థానిక నాయకులు ఏ శ్రీను, ఎస్ కె.సలీం తదితరులు పాల్గొన్నారు.

## బైక్ దొంగలు అరెస్టు

**ప్రజాశక్తి-కంచికచర్ల:** కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు బైకు దొంగలను అదుపులోకి తీసుకుని వారి నుండి ఆరు మోటర్ బైక్ లను స్వాధీన పరుచుకున్నట్లు కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు తెలిపారు. కంచికచర్ల మండల పరిధిలోని గొట్టుముక్కల రోడ్లో అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో బైక్ దొంగల వ్యవహారం బయటపడింది. ఈ సందర్భంగా వారు అపహరించిన ఆరు బైక్లను స్వాధీనపరచుకున్నట్లు ఎస్సై తెలిపారు. కంచికచర్ల గ్రామానికి చెందిన మేచర్ల రాహుల్, కుప్పాల నాగ వెంకట తిరుపతిరావు, పదముత్తు పవన్ కుమార్ లు కంచికచర్ల, భవానిపురం, తుళ్లూరు, జి కొండూరు తదితర ప్రాంతాలలో బైక్లను అపహరించినట్లు గుర్తించామన్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కాటన్ వర్ధంతి

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ :** గోదావరి, కృష్ణా డెల్టాల రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ రైతులపాలిట అపర భగీరధుడని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకష్ణారావు అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ 126వ వర్ధంతి సందర్భంగా గురువారం విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలో ఉన్న కాటన్ విగ్రహానికి వెంకట గోపాలకృష్ణారావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కఠారి కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 1852లో కాటన్ ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్టను నిర్మించి ఆ ప్రాంత ప్రజల హృదయాల్లో అపర భగీరదుడుగా మిక్కిలి ఘనకీర్తిని సంపాదించుకున్నారని, దేశ చరిత్రలో తొలిసారిగా కష్ణా, గోదావరి



డెల్టాల వ్యవస్థను కాలువల ద్వారా ఆయకట్టు, డ్రైనేజి పద్ధతిలో నిర్మించి మార్గదర్శకులైనారని అన్నారు. 1840 లోనే కష్ణానదిపై ఆనకట్ట ప్రతిపాదనలను బ్రిటీష్ ప్రభుత్వానికి పంపించి సిఫారసు చేయటమే కాకుండా ధవళేశ్వరం బ్యారేజ్ పూర్తయిన తరువాత కృష్ణానదిపై ఆనకట్టను నిర్మించారన్నారు.

## విద్యార్థికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి డాక్టర్ అమర్ సుధీర్ ప్రోత్సాహం, ప్రిన్సిపాల్ ఎస్.శరవణ కుమార్ మార్గదర్శకత్వం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేన్సర్తో పోరాడుతున్న విద్యార్థి ఎస్.హేమంత్ వీరేంద్రకు ఆర్థిక సహాయం అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రూ.20 వేలు సేకరించి బాధితునికి అందజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.